క్లుప్తంగా

అబద్ధపు హామీలతో కూటమి నయవంచన



మంద జయలక్ష్మి

ఉంగుటూరు: అబద్ధపు హామీలతో చంద్రబాబు ప్రజలను నయవంచన చేశాడని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మంద జయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడనుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయణించొచ్చని హామీ ఇచ్చి, ఇపుడు కేవలం జిల్లాలకే పరిమితం చేయడం అది కూడా ఏడాది పాలన దాటిపోయాక అమలు చేస్తాననడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళలు చంద్రబాబును నమ్మి మోసపోయారన్నారు. పైగా ఉచిత పథకం కొన్ని బస్సుల్లోనే అని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బడి, గుడి తేడా లేకుండా మద్యం ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా అమ్ముతున్నారని పైగా రూము ఏర్పాటు చేసి తాగేవారికి అనువుగా చేస్తామని ఓ మంత్రి ప్రకటించడం ఇళ్ల వద్ద మహిళలకు మనశ్శాంతి లేకుండా చేయడానికేనని అన్నారు.

ఫైళ్లు ఆన్‌లైన్ చేయించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: గ్రామ పంచాయతీలకు చెందిన ఫైళ్లు అన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో రాజ్ మనోజు మాట్లాడుతూ పీ–4 అమలుపై దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం నిరంతరంగా అమలు చేయాలని సూచించారు. పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధిలో మామిడి సాగు



ఉపాధిలో సాగవుతున్న మామిడి

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో మామిడి సాగును సోమవారం ఏపీవో ఫాతిమా ప్రసన్న, టీఏ దీప్తి పరిశీలించారు. ఎకరాకు 70 మామిడి మొక్కలు సాగుకుగాను మూడు సంవత్సరాలకు రూ.1,09,950 నిర్వహణ ఖర్చుల నిమిత్తం రైతు బ్యాంకు ఖాతాకు జమ చేస్తారన్నారు. మెట్ట గ్రామంలో మామిడి సాగు ఆశాజనకంగా ఉంటుందని స్థానిక రైతులు చెబుతున్నారన్నారు. వారి వెంట పెరుగ్గూడెంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ గొన్నూరి శివ తదితరులు ఉన్నారు.

విధుల్లోకి సర్పంచి



సర్పంచి సుధీష్ణ

ఉంగుటూరు: కాగుపాడు సర్పంచి కడియాల సుధీష్ణ తిరిగి బాధ్యతలను చేపట్టారు. పంచాయతీ పాత భవనాన్ని అనుమతులు పొందకుండా పడగొట్టేశారని నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణపై మూడు నెలలు విధుల నుంచి సస్పెండు చేశారు. మూడు నెలలు పూర్తి కావడంతో సుధీష్ణకు తిరిగి బాధ్యతలు ఇస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో తాను చేసిన న్యాయ పోరాటానికి సహకరించిన వారికి సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయంగా దెబ్బ తీయాలని వ్యతిరేక వర్గం వారు రాజకీయ కుట్రలో భాగంగా చేశారని సర్పంచి సుధీష్ణ వివరించారు.

పీజీఆర్‌ఎస్‌లో 12 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 12 అర్జీలు అందినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. వాటిలో శ్రీనివాసపురంలో స్థల ఆక్రమణపై బి.బంగారయ్య, భూమిని సర్వేచేయాలని తాడువాయికి చెందిన గాలింకి ఫ్రాన్సిస్, పంగిడిగూడెం బండిదారి ఆక్రమణపై పేరంపేటకు చెందిన భీమడోలు పిచ్చియ్య, పంగిడిగూడెం– లక్కవరం ఆర్‌అండ్‌బీ రహదారి ఆక్రమణపై పంగిడిగూడెం గ్రామానికి చెందిన బేతాళ అశోక్, జంగారెడ్డిగూడెం – తాళ్లపూడి – రాజమండ్రి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన కె.రమణారావు అర్జీలు అందజేశారు. బీసీ రుణాలు ఇప్పిస్తామని తమ నుంచి రూ. 9.77 లక్షలు వసూలు చేసిన సత్తిపండుపై చర్యలు తీసుకోవాలని దేవులపల్లి గ్రామానికి చెందిన తనుబోయిన సుబ్బారావు, మరికొందరు అర్జీలు అందజేశారు.

ఓటర్ జాబితాలు సవరించాలి

కొయ్యలగూడెం: ఓటర్ జాబితాను సవరించాల్సిందిగా ఇన్‌చార్జి ఎంపీడీవో జి.సతీష్ కుమార్‌కి కొయ్యలగూడెం చెందిన యువకులు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. మండలంలోని పంచాయతీల్లో ఓట్ల విధానం సరిగా లేదని, దీనివల్ల వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు తీవ్ర గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉందన్నారు. వార్డ్ మెంబర్లు ప్రజా సమస్యలు పరిష్కరించి, ఒక కుటుంబానికి సంబంధించి ఓటర్లందరూ ఒకే బూత్‌లో ఉండే విధంగా పరిష్కరించాలని కోరారు.

అరకొర సేవలతో అందని వైద్యం



ఖాళీగా దర్శనమిస్తున్న గోపన్నపాలెం పీహెచ్‌సీ



వివరాలు చెప్పే వారే లేని పెదవేగి పీహెచ్‌సీ

- పీహెచ్‌సీల్లో వేధిస్తున్న వైద్యులు, మందుల కొరత
- సమయపాలన పాటించాలని కోరుతున్న ప్రజలు



దెందులూరు సబ్ సెంటర్ వద్ద సౌకర్యాలు లేక అరుగుపై టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: పీహెచ్‌సీల్లో అరకొర వైద్యులతో వైద్య సేవలు అందక రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీ) మందులు, సౌకర్యాలు, పరికరాలు, వైద్య సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యత ఇవ్వటం కోట్లాది రూపాయలు బడ్జెట్‌లో కేటాయించి అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వైద్యశాలలను బలోపేతం చేశారు. నూతన వైద్యశాలలు నిర్మించారు. ఉన్న వైద్యశాలలకు అదనంగా గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్న దూర దృష్టితో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తరువాత ఎవరికైనా అత్యవసరం అయితే నర్సులు మాత్రమే అరకొర వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక వ్యాధిని నిర్ధారించే అర్హత సామర్థ్యం నర్సులకు ఉండదు. బాధితులకు వచ్చిన అనారోగ్యాన్ని వైద్యుడికి తెలియజేసి వైద్యుడు చెప్పిన సూచన మేరకు ఇంజక్షన్లు, టాబ్లెట్లు ఇస్తున్నారు. మరీ సీరియస్ అయితే ఏలూరు ఇతర వైద్యశాలలకు తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 4 గంటలు మాత్రమే వైద్యుల సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ఎవరికైనా నాలుగు గంటల తరువాత అనారోగ్యం వస్తే వారి పరిస్థితి ఏమిటని, వారికి ఎవరు భద్రత ఎవరు కల్పిస్తారని పలువురు విమర్శిస్తున్నారు. నైట్ డ్యూటీలో వైద్యులు ఉండరు, రాత్రి వేళల్లో వైద్య సేవలందించ. ఏదైనా అత్యవసరమైనా ఇదే తీరు కనబరుస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని రాత్రి వేళల్లోనూ పేదలకు వైద్య సేవలు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీహెచ్‌సీలో వేధిస్తున్న డాక్టర్ల కొరత

దెందులూరులో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నియోజకవర్గ వైద్యశాలలో పిల్లల వైద్యుల సర్జన్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు రెండు కోట్ల 70 లక్షల రూపాయలతో వైద్యశాలను ఆధునికీకరించి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ఈ వైద్యశాల 30 పడకల వైద్యశాలగా ఉంది. దీనిని 50 పడకల వైద్యశాలగా మార్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. 50 పడకల వైద్యశాలగా మార్చడం వలన మరింత మంది ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు 50 పడకల ఆసుపత్రికి సంబంధించి మరిన్ని అధికంగా వైద్య సౌకర్యాలు, సేవలు లభిస్తాయి. పెదవేగి మండలంలో మండల కేంద్రమైన పెదవేగి పీహెచ్‌సీలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు పని చేయాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు. అదే విధంగా విజయరాయి పీహెచ్‌సీలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు పని చేయాల్సి ఉండగా ఒకరు మాత్రమే పని చేస్తున్నారు. అమ్మపాలెం ఎంఎల్‌హెచ్‌పీ ఒక పోస్ట్ ఖాళీగా ఉంది. కూచింపూడి, రామశింగవరం గ్రామాల్లో సచివాలయ ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక సీహెచ్‌ఓ పోస్ట్ కూడా ఖాళీగా ఉంది.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిమేద్దాం



పీహెచ్‌సీ వద్ద వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించొచ్చని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని గుండుగొలను వైద్యాధికారిణి డాక్టర్ జాహ్నవి రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఈ నెల 12వ తేదీ మంగళవారం చేపట్టనున్న నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమంపై సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సును నిర్వహించారు. తొలుత గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. వైద్యాధికారిణి జాహ్నవి రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు, యువతకు నులిపురుగుల నివారణలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని 85 పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 11430మంది చిన్నారులు, యువకులకు మాత్రలను అందిస్తామన్నారు. నూరుశాతం మాత్రలు పంపిణీ చేసి విజయవంతం చేయాలని కోరారు. వారందరికి భోజన విరామం అనంతరం వారితో మాత్రలు మింగించాలన్నారు. 1, 2 ఏళ్ల చిన్నారులకు సిరప్ అందిస్తామన్నారు. దీని వలన నులిపురుగులు నివారించబడతాయని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. కార్య క్రమంలో వైద్యురాలు డాక్టర్ శరణ్య, సీహెచ్‌వో ఇందిరా, సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ, ఎఎంఎన్‌లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు: ఈ నెల 18నుంచి నెలరోజుల పాటు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణసంస్థ ప్రతినిధి శిరోమణి తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు వెలుగు ఆఫీసు ప్రాంగణంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన మహిళలు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వివరాలకు 9502723561, 9014040780, 9533079471, 9948565256 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్య్రం



జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు

భీమడోలు: దేశ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడాలంటూ మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు గ్రామ కార్యదర్శి కేవీ తనూజ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు భీమడోలు పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ఎందరో మహనీయుల త్యాగఫలమే స్వాతంత్య్రమని, ప్రతి ఒక్కరూ వారి త్యాగాలను స్మరించుకోవాలని గ్రామ కార్యదర్శి కేవీ తనూజ కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెజ్జు వినయ్, ప్రతాప్, పెద్దలు పైడిమాల యుగంధర్, ఈతకోట సత్యకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్త విధానంతో విద్యార్థులకు అదనపు భారం



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈవో-2 అయినపర్తి భాస్కర్‌కుమార్

భీమడోలు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం సెల్ఫ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ-1) పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, లెక్కల పరీక్షలు రాశారు. కూటమి సర్కార్ అసెస్‌మెంట్ బుక్ లెట్‌ను అందించింది. దీంతో విద్యార్థి అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లో ప్రశ్నలకు సమాధానాలు రాయడంతో పాటు ప్రశ్నాపత్రంలోనూ వాటిఆన్సర్లను రాయాల్సివస్తుంది. అంటే రెండు సార్లు ప్రశ్నలకు ఆన్సర్లు రాయాలి. దీంతో విద్యార్థులపై అదనపు భారం పడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటిని సక్రమంగా రాస్తున్నదీ లేనిదీ విద్యాశాఖాధికారులు పరిశీలించారు. గుండుగొలను మోడల్ ప్రైమరీ పాఠశాల నంబర్-1లో జరుగుతున్న పరీక్షలను భీమడోలు ఎంఈవో-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పరిశీలించారు. సుమారు 120 మంది విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని, నిర్వహణ విధానాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలందించారు. హెచ్‌ఎం పాశం పాండు రంగారావు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

చింతలపూడి: పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మరియమ్మ మాట్లాడుతూ కాంట్రాక్టర్ గడువు ముగిసిందని, కానీ పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు కార్మికుల ఖాతాల్లోకి జమ కాలేదన్నారు. తక్షణం పీఎఫ్ బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు, కుమారి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వీడీ ప్రసాద్

పెదవేగి: మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున కార్మిక పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్‌వీడీ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పెదవేగి మండలం లక్ష్మీపురం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం మోదీకి ఎవరిచ్చారని ఆటో, హమాలి తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రమేష్, పి.ప్రసాద్, బి.రోజా, రాజ్యలక్ష్మి, గంగాధర్, సుబ్బారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దళిత గ్రామాల సమస్యలు పట్టవా?

- అధ్వానంగా రహదారులు.. వెలగని వీధి లైట్లు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు, పాలకులు
- 3 కిలోమీటర్ల మేర గుంతల రోడ్డుతో ప్రజల ఇక్కట్లు
- ఆసుపత్రికి వెళ్లాలన్నా అంబులెన్స్, ఆటోలు రాని పరిస్థితి



గుండుగొలను నుంచి భోగాపురం వరకు అధ్వానంగా ఉన్న రహదారి



రోడ్డుపై వెలగని విద్యుత్ దీపాలు



రోడ్డు వెంబడి వేసిన విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పిచ్చిమొక్కలు

భీమడోలు: కష్టంగా మారిన గుండుగొలను నుంచి భోగాపురం వరకు గల పంచాయతీరాజ్ రోడ్డు ప్రయాణం మరింత దారుణంగా మారింది. వర్షాలు, మరమ్మతుల లేమితో రహదారి పూర్తిగా పాడై, గుంతలు ఏర్పడి నడకే కష్టంగా మారింది. అడుగుకో గొయ్యి, గజానికో గుంత అన్న చందంగా తయారైంది. రహదారి వెంబడి వేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలు ఇంతటి సమస్యలు పట్టి పీడిస్తున్నప్పటికీ భోగాపురం వాసులు కొన్నేళ్లుగా భరిస్తున్నా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వారి ఇబ్బందులు రెట్టింపు అయ్యాయి. కొల్లేరు గ్రామాలకు వెళ్లే వాహనాలన్నీ గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నాయి. అదే విధంగా దళిత గ్రామం భోగాపురం గ్రామస్తులకు ఇదే ప్రధాన రహదారి కావడంతో రాత్రి, పగలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాటు గుండుగొలను రైతులు భోగాపురం వద్ద గల వ్యవసాయ పొలాలల కోసం నిత్యం వెళ్లి వస్తుంటారు. అయితే ఇంతటి ప్రాధాన్యత గల రోడ్డుపై పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. భారీ గోతులు ఏర్పడి, వాహనాలు, ఆటోలు భయం భయంగా ప్రయాణిస్తూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మూడు కిలోమీటర్ల రోడ్డుపై నుంచి కొల్లేరు గ్రామాలకు చెందిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, భారీ వాహనాలు ప్రయాణించడంతో గుంతలతో నిండి ఉన్న ఈ రోడ్డు మరింత అధ్వాన్నంగా మారింది. విద్యార్థులు, రైతులు, మహిళలు ప్రయాణించాలంటేనే ఆందోళన చెందుతున్నారు. అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా అంబులెన్స్, ఆటోలు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రతిసారి గ్రామాల్లో జరిగే సమావేశాల్లో భోగాపురం వాసులు తమ సమస్యలను అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. కనీసం సంబంధిత అధికారులు గోతులను పూడ్చేందుకు కూడా శ్రద్ధ వహించకపోవడంతో భోగాపురం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా, పనులు ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు వెంబడి వెలగని వీధి లైట్లు

గుండుగొలను నుంచి భోగాపురం వరకు గల రోడ్డు వెంబడి విద్యుత్ స్తంభాలతో పాటు వీధి దీపాలు ఉండేవి. అయితే సాంకేతిక సమస్య కారణంగా కొంత కాలంగా వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో పాటు రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు కృంగిపోయింది. దీంతో విద్యుత్ స్తంభాలు సైతం ఒరిగిపోయాయి. దీనికి తోడు రోడ్డు వంకరలుగా ఉండడంతో ముందొచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి దాపురించింది. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ స్తంభాలపై పిచ్చి మొక్కలు మొలిచాయి. దీంతో రహదారిపై రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటేనే భీతిల్లిపోతున్నారు. గ్రామ సింహాలు మహిళలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే మరమ్మతులు చేపడతాం



గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు వెంబడి రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుండుగొలను నుంచి భోగాపురం రోడ్డు మీదుగా కొల్లేరు ప్రజలు ప్రయాణిస్తున్నారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు నా వంతు కృషి చేస్తాను. అయితే గతంలో ఈ రోడ్డు మరమ్మతులకు మండల పరిషత్ నుంచి రూ.8 లక్షల నిధులు మంజూరు చేశాం. అయితే ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఆ పనులు రద్దు చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఈ రోడ్డుకు తొలి ప్రాధాన్యత ఇస్తాం. గ్రామస్తులు ఆందోళన చెందనవసరం లేదు.

– కనమాల రామయ్య, ఎంపీపీ, భీమడోలు

దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దర ఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ తారకేశ్వరరావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పై దేవాలయానికి ధర్మకర్తగా నియామకం పొందుటకు 20రోజుల్లో దేవాదాయ ధర్మాదాయశాఖ నమూనా ఫారం-2 దరఖాస్తును జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్, ఏలూరు వారికి పంపించాలని తెలిపారు. వివరాలకు ఆఫీసు పని వేళల్లో సంప్రదించాలని ఈఓ కోరారు.